సంపుటి :03 సంచిక :69 పేజీలు :07 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 24, ఏప్రిల్ 2026

# ఆర్టీసీ సమ్మెలో విషాదం

- నర్సంపేటలో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి
- భగ్గుమన్న ఆర్టీసీ కార్మికులు.. ఉద్రిక్తత

4

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజున పెను విషాదం నింపింది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం లేదనే మనస్తాపంతో వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ (54) గురువారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నర్సంపేట బస్ డిపో ముందు తోటి కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న శంకర్ గౌడ్, మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నారు. సెకన్ల వ్యవధిలోనే మంటలు వ్యాపించడంతో గమనించిన తోటి కార్మికులు, పోలీసులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఆయనకు సుమారు ఎనభై శాతం వరకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట ఆయనను నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, వైద్యుల సూచన మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిచెందారు.

–అక్షరదర్బార్, నర్సంపేట










# ప్రారంభం కాకముందే పగుళ్లు

- పరకాల డిగ్రీ కళాశాల నిర్మాణంలో 'నాణ్యత' మాయం!
- రూ. 5 కోట్ల నిధులు.. అప్పుడే భవనానికి బీటలు
- రంగులతో పగుళ్లను కప్పిపుచ్చే ప్రయత్నం.. విద్యార్థుల భద్రతపై ఆందోళన

పరకాల ప్రాంత విద్యార్థుల దశాబ్దాల కల.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం. తీరా నిర్మాణం పూర్తికాకముందే ఆ కల బీటలు వారుతోంది. రూ. 5 కోట్ల భారీ నిధులతో నిర్మిస్తున్న ఈ భవనం, ప్రారంభోత్సవానికి ముందే నిలువునా పగుళ్లతో దర్శనమిస్తుండటం నిర్మాణ రంగంలో జరుగుతున్న అక్రమాలకు అద్దం పడుతోంది. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల లాభాపేక్ష వెరసి విద్యా మందిరం పునాదుల స్థాయిలోనే బలహీనపడుతోంది. పగుళ్లు కనిపిస్తే వాటిని సరిచేయాల్సింది పోయి, రంగుల పూతతో కప్పిపుచ్చే ప్రయత్నం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ వ్యవహారంపై 'అక్షరదర్బార్' ప్రత్యేక కథనం.

- అక్షరదర్బార్, పరకాల:

6

# మే 15 డెడ్ లైన్

- భద్రకాళి పూడిక మట్టి తరలింపుపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లతో సమన్వయ సమావేశం

5



# ఇద్దరు ఎస్సైల సస్పెన్షన్

అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై సీపీ కఠిన నిర్ణయం

6



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు
- ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

అక్షర దర్బార్, భూపాలపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా కుటుంబాలపై భారం తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ పారదర్శకంగా సాగుతోందని, ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# అమ్మ తర్వాత అమ్మ.. అంగన్‌వాడీ టీచరమ్మ!

- క్రోసూరుపల్లిలో ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే'
- అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- సర్పంచ్ తౌటం లక్ష్మి

అక్షర దర్బార్, చిట్యాల: పసిపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు అమ్మ తర్వాత అమ్మలాంటి వారని చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య కొనియాడారు. గురువారం మండలంలోని క్రోసూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ సుజాత ఆధ్వర్యంలో 'పోషణ్ పక్వాడా' మరియు 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ.. ఆటపాటలతో ప్రాథమిక విద్యను అందించడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమన్నారు. ఉప సర్పంచ్ బుర్ర వెంకన్న మాట్లాడుతూ 3 నుండి 5 ఏళ్ల పిల్లలను తప్పనిసరిగా కేంద్రాలకు పంపాలని తల్లులకు సూచించారు. అనంతరం ఉత్తమ తల్లిగా నిలిచిన పుల్ల శ్రావికను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ అల్లం అనుష, టీచర్లు సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, అరుణదేవి, ప్రమీల, గ్రామస్తులు పాల్గొన్నారు.




# కుట్టు మిషన్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

## మహమ్మదాపురం సర్పంచ్ గోగుల శ్రీనివాస్ రెడ్డి

అక్షర దర్బార్, దుగ్గొండి: మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు మిషన్ శిక్షణ ఎంతో దోహదపడుతుందని మహమ్మదాపురం సర్పంచ్ గోగుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం దుగ్గొండి మండలం మహమ్మదాపురం గ్రామంలో 'యువ పరివర్తన కీరవాడి సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోనే మహిళలకు ఉపాధి మార్గాలు చూపడం అభినందనీయమన్నారు. సంస్థ మేనేజర్ అడ్డ సతీష్ మాట్లాడుతూ కుట్టు మిషన్‌తో పాటు కంప్యూటర్, నర్సింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో కూడా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ కీ పర్సన్ జీవన్, వీఓఏ లావణ్య, కోశాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా 'నరేంద్ర మోడీ కప్' క్రికెట్ టోర్నీ

- విజేతలకు రూ. 50,000 నగదు బహుమతి
- జిల్లా క్రీడాకారులకు మాత్రమే అవకాశం..
- వేల్పుల రాజ్ కుమార్



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలో త్వరలో 'నరేంద్ర మోడీ కప్' పేరుతో భారీ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ నాయకులు వేల్పుల రాజ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన ఈ క్రీడల వివరాలను వెల్లడిస్తూ, ఈ టోర్నీలో గెలుపొందిన ప్రథమ విజేత జట్టుకు రూ. 50,000, ద్వితీయ విజేతకు రూ. 25,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ టోర్నమెంట్ కేవలం గ్రామస్థాయి (విలేజ్ టు విలేజ్) పోటీలని, ఏ గ్రామానికి చెందిన క్రీడాకారులు ఆ గ్రామం తరపున మాత్రమే ఆడాలని స్పష్టం చేశారు. కేవలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా క్రీడాకారులకు మాత్రమే ఈ పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు. ఎంట్రీ ఫీజుగా రూ. 2,550 నిర్ణయించినట్లు, టీమ్ రిజిస్ట్రేషన్ సమయంలోనే సగం ఫీజు చెల్లించాలని తెలిపారు. క్రీడాకారులు తమ ఆధార్ కార్డును తప్పనిసరిగా సమర్పించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడే సమయంలో ప్రతి క్రీడాకారుడు టీ-షర్ట్ డ్రెస్ కోడ్ పాటించాలని, ఈ టోర్నీలో కేవలం 40 టీమ్‌లకు మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 7287920310 నంబర్‌లో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని రాజ్ కుమార్ కోరారు.

# సింగరేణి కార్మికులకు భారీ బీమా

- సహజ మరణానికి రూ. 10 లక్షలు!
- ఎస్‌బీఐతో సింగరేణి యాజమాన్యం చారిత్రాత్మక ఒప్పందం
- 40 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం పింఛనుదారులకూ రూ. 30 లక్షల ప్రమాద బీమా




అక్షర దర్బార్, భూపాలపల్లి: సింగరేణి సంస్థ కార్మిక సంక్షేమంలో మరో మైలురాయిని అధిగమించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో శాలరీ అకౌంట్ ఉన్న సింగరేణి ఉద్యోగులకు సహజ మరణం సంభవించినా రూ. 10 లక్షల గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్స్ అందించేలా గురువారం హైదరాబాద్‌లో కీలక ఒప్పందం కుదిరింది. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పోట్రు చొరవతో ఈ ఒప్పందం కుదిరింది. ఇప్పటికే ప్రమాద బీమా కింద రూ. కోటి అందజేస్తుండగా, తాజాగా సహజ మరణానికి కూడా బీమా కల్పించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు 70 ఏళ్ల వరకు రూ. 30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ డీజీఎం నీలాక్ష్మిసింగ్ తదితరులు పాల్గొన్నారు.




## చిన్నారి అనుష్కను ఆశీర్వదించిన కీర్తి రెడ్డి

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రానికి చెందిన అరవింద్, భార్గవి దంపతుల కుమార్తె అనుష్క మొదటి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనుష్క నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, బీజేవైఎం నాయకులు గాలీఫ్, రవీందర్, రాజేందర్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రభాకర్, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత కేసీఆర్‌దే!

- కాంగ్రెస్ కుట్రలకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు: మాజీ ఎమ్మెల్యే గండ్ర
- ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి

అక్షర దర్బార్, భూపాలపల్లి: తెలంగాణలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతును రాజును చేసిన ఘనత కేవలం కేసీఆర్‌కే దక్కుతుందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టులు, రైతు బంధు వంటి పథకాలతో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చిన చరిత్ర బీఆర్ఎస్‌ది అని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ఆరోపణలు చేసిన రేవంత్ సర్కార్‌కు హైకోర్టు తీర్పు గట్టి చెంపపెట్టులా మారిందన్నారు. అబద్ధం ప్రచారమైనా, చివరకు నిజమే నిలుస్తుందని పేర్కొన్నారు. కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.





# మక్క రైతులకు అండగా బీఆర్ఎస్ పోరాటం

- నియోజకవర్గ వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో భారీ ధర్నా
- రూ. 2400 మద్దతు ధర ఇచ్చే వరకు వదిలే ప్రసక్తే లేదు: పెద్ది సుదర్శన్ రెడ్డి
- కాంగ్రెస్ సర్కార్ అసమర్థత వల్లే రైతులు రోడ్డున పడ్డారు



అక్షర దర్బార్, నర్సంపేట: ఆరుగాలం కష్టించి పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నిప్పులు చెరిగారు. గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట, నెక్కొండ, దుగ్గొండి మండల కేంద్రాలతో పాటు వ్యవసాయ మార్కెట్ యార్డులలో మొక్కజొన్న రైతులకు మద్దతుగా భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

**ప్రభుత్వానికి సోయి లేదు.. రైతుకు దిక్కు లేదు..**

ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కజొన్న కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస అంచనా లేదని మండిపడ్డారు. రూ. 2400 మద్దతు ధర చెల్లిస్తామని చెప్పి, నేటికీ జీవో విడుదల చేయకుండా రేవంత్ రెడ్డి సర్కార్ రైతులను వంచిస్తోందని ధ్వజమెత్తారు. "జిల్లా మంత్రులు సీతక్క, కొండ సురేఖలు జీవో విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్నారు. రైతుల ముసుగులో ఉన్న అరాచక పాలనపై అన్నదాతలు తిరగబడితే మీరు ప్రజల్లో తిరగలేరు" అని హెచ్చరించారు.

**ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై విమర్శల జడివాన**

నెల రోజులుగా 45 డిగ్రీల మండుటెండలో రైతులు కల్లాల వద్దే మాడిపోతున్నా స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కనీసం సోయి లేదని విమర్శించారు. "నాడు కేసీఆర్ హయాంలో ప్రతి మండలానికి 7 నుండి 8 కొనుగోలు కేంద్రాలు పెట్టి, మొత్తం నియోజకవర్గంలో 42 సెంటర్లు నడిపించాం. కానీ నేడు మండలానికి ఒక్క సెంటర్ మాత్రమే పెట్టి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటు" అని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో మొక్కజొన్నకు రూ. 270 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు మద్దతు ధరకే దిక్కులేకుండా చేశారని మండిపడ్డారు.

**అధికారుల తీరుపై ఆగ్రహం**

ఎకరానికి కేవలం 26 క్వింటాళ్లే కొంటామని అధికారులు చెప్పడంపై పెద్ది సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సారవంతమైన నర్సంపేట భూముల్లో ఎకరానికి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, మిగిలిన 19 క్వింటాళ్లను ఎమ్మెల్యే దొంతి కొంటారా? అని ప్రశ్నించారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని క్వింటాకు రూ. 600 నుండి 700 వరకు నష్టపోతున్నారని, ఈ నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో లక్ష మెట్రిక్ టన్నుల గోదాములు ఉన్నా, వాటిపై సమీక్ష లేకుండా రైతులను రోడ్లపైకి లాగడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్, నియోజకవర్గ కోఆర్డినేటర్, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జెడ్పిటిసిలు, కౌన్సిలర్లు మరియు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# కాకతీయ హైస్కూల్‌లో మిన్నంటిన సంబరాలు

- ఘనంగా 36వ వార్షికోత్సవ వేడుకలు
- పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి: ట్రైనింగ్ ఎస్సై హేమ

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ 36వ వార్షికోత్సవ వేడుకలు గురువారం పాఠశాల కరస్పాండెంట్ ఎండీ రాజ్ మహమ్మద్ ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనింగ్ ఎస్సై హేమ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిల్లలు అడిగిందల్లా ఇవ్వకుండా, ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచి చదువు పట్ల ఆసక్తి పెంచేలా చూడాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఎలక్ట్రికల్ స్కూటీలు,
# ఆటోలు ఉచితంగా ఇవ్వాలి

- వికలాంగుల సంఘం నాయకుడు పుల్ల మల్లయ్య డిమాండ్

అక్షర దర్బార్, చిట్యాల: రాష్ట్రంలోని వికలాంగులందరికీ ప్రభుత్వం ఉచితంగా ట్రై మోటరైజ్డ్ స్కూటీలను, ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ చేయాలని వికలాంగుల సంఘం నాయకుడు పుల్ల మల్లయ్య కోరారు. గురువారం చిట్యాలలో ఆయన మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి వికలాంగుడిని ప్రభుత్వం మానవీయ కోణంలో ఆదుకోవాలన్నారు. శారీరక వైకల్యం వల్ల ఉపాధి పొందలేక ఇబ్బందులు పడుతున్న వారికి వాహనాలు అందజేస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. అలాగే వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# పోయిన మొబైల్స్ తిరిగొచ్చాయి..

- బాధితులకు అందజేసిన ఎస్పీ
- సీఈఐఆర్ (CEIR) పోర్టల్‌ను వినియోగించుకోవాలి:
- ఎస్పీ సుధీర్ రామనాథ్



అక్షర దర్బార్, వెంకటాపూర్: ములుగు జిల్లాలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు ఊరటనిచ్చారు. వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన 25 మొబైల్ ఫోన్లను ఐటీ కోర్ టీమ్ సహాయంతో గుర్తించి, గురువారం జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఫోన్ పోయిన వెంటనే ప్రజలు ఆందోళన చెందకుండా సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లను త్వరగా రికవరీ చేస్తున్నామని, ఐటీ టీమ్ మరియు స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు.

# అప్రమత్తమైన అధికారులు



- 'బాల్య వివాహం' బ్రేక్!
- మొగుళ్లపల్లిలో పెళ్లిని అడ్డుకున్న తహసీల్దార్, పోలీసులు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్ల పల్లి మండల కేంద్రంలో గురువారం జరగాల్సిన ఒక బాల్య వివాహాన్ని అధికారులు సమయస్ఫూర్తితో అడ్డుకున్నారు. గోరి కొత్తపల్లికి చెందిన మైనర్ బాలుడికి, మొగుళ్లపల్లికి చెందిన యువతికి వివాహం నిశ్చయమైంది. బాలుడు మైనర్ అనే సమాచారం చైల్డ్ హెల్ప్‌లైన్‌కు అందడంతో తహసీల్దార్ సునీత, ఎంపీడీవో సురేందర్ రంగంలోకి దిగారు. పెళ్లి నిలిపివేయించి ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ రజిత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ సమ్మెలో విషాదం

- నర్సంపేటలో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నం
- ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న శంకర్
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి
- భగ్గుమన్న ఆర్టీసీ కార్మికులు.. ఉద్రిక్తత



అక్షరదర్బార్, నర్సంపేట : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజున పెను విషాదం నింపింది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడం లేదనే మనస్తాపంతో వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ (54) గురువారం మధ్యాహ్నం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. నర్సంపేట బస్ డిపో ముందు తోటి కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న శంకర్ గౌడ్, మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నారు. సెకన్ల వ్యవధిలోనే మంటలు వ్యాపించడంతో గమనించిన తోటి కార్మికులు, పోలీసులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఆయనకు సుమారు ఎనభై శాతం వరకు తీవ్ర గాయాలయ్యాయి. మొదట ఆయనను నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో, వైద్యుల సూచన మేరకు గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిచెందారు.

**భగ్గుమన్న నిరసనలు**

శంకర్ గౌడ్ ఆత్మహత్యాయత్నంతో మొదట నర్సంపేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆగ్రహించిన కార్మికులు నేషనల్ హైవే-565పై రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం మొండివైఖరి వీడాలని, కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ఘటనతో ఖమ్మం-మహబూబాబాద్-వరంగల్ రహదారులపై ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే మాజీ మంత్రులు, పలువురు బీఆర్ఎస్ నేతలు ఎంజీఎం ఆసుపత్రికి చేరుకుని శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మెను విరమింపజేసేలా చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా ఈ ఘటనపై స్పందిస్తూ కార్మికులు ఎవరూ ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. శుక్రవారం ఆర్టీసీ జేఏసీని చర్చలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో తీవ్ర గాయాలతో ఉన్న శంకర్ గౌడ్ ను హైదరాబాద్ కు తరలిస్తుండగా ఆయన రాత్రి మార్గమధ్యంలో మృతి చెందారు. దీంతో ఆర్టీసీ కార్మికుల్లో తీవ్ర విషాదం నింపింది.



## ఆర్టీసీ సమ్మెకు 'చల్లా' సంఘీభావం

- కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శలు
- సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేయడం అన్యాయం
- పరకాల డిపో వద్ద కార్మికులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల: తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సంఘీభావం తెలిపారు. గురువారం పరకాల డిపో వద్ద సమ్మెలో కూర్చున్న కార్మికులను పరామర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి ఇప్పుడు కమిటీల పేరుతో కాలయాపన చేయడం కార్మికులను మభ్యపెట్టడమేనని మండిపడ్డారు. మండుటెండల్లో నిరసన తెలుపుతున్న కార్మికులకు కనీస వసతులు కల్పించకపోవడం, టెంట్లు వేయనీయకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉద్యమం ఉధృతమవుతుందని హెచ్చరించారు.

# మొట్లపల్లి పాఠశాలలో విద్యార్థుల సందడి

- వార్షికోత్సవంలో అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు గురువారం గ్రామ సర్పంచ్ నరహరి వెంకట్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంఈఓ లింగాల కుమార స్వామి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని సర్పంచ్ కొనియాడారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెడ్మాస్టర్ సరిత మహేష్, ఆలయ చైర్మన్ రఘుపతి రెడ్డి, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆటోబోల్తా పడి బాలిక మృతి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : పాఠశాలకు సెలవులు రావడంతో చెల్లేను తీసుకెళ్లడానికి వచ్చి తిరుగు ప్రయాణంలో అక్క కానరాని లోకాలకు వెళ్లిన ఘటన మండలంలోని పర్లపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన కోల సాన్విక (25) తన భర్త అనిల్, అక్క ముదురుకోళ్ల స్వప్నతో కలిసి వారి సొంత ఆటోలో మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల ఆదర్శ పాఠశాలలో చదువుతున్న తన చెల్లలు సాత్విక పాఠశాలకు చివరి పనిదినం కావడంతో తీసుకెళ్లడానికి పాఠశాలకు చేరుకున్నారు. తిరిగి తన చెల్లిని తీసుకువెళ్లుతున్న క్రమంలో మండలంలోని పర్లపల్లి గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి బోల్తా పడగ కోల సాన్విక అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో ప్రయాణిస్తున్న మిగత వారికి గాయాలు కాగ వారిని 108 వాహనంలో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అక్షర సేద్యం ముగించి.. కన్నీటి వీడ్కోలుతో సెలవు

- చింతలపల్లి స్కూల్ అసిస్టెంట్ ఇంజపూరి నరసయ్య పదవీ విరమణ

అక్షరదర్బార్, మొగుళ్ళపల్లి: ఆ పాఠశాల గోడలు ఆయన చెప్పే పాఠాలతో ప్రతిధ్వనించాయి. ఆ చెట్ల నీడలు ఆయన వేసిన అడుగులకు సాక్ష్యాలుగా నిలిచాయి. దశాబ్దాల కాలం పాటు వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన అక్షర శిల్పి, స్కూల్ అసిస్టెంట్ ఇంజపూరి నరసయ్య గురువారం చింతలపల్లి ఉన్నత పాఠశాల నుండి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భం పాఠశాలలో ఒక పండుగలా సాగినా, ముగింపులో మాత్రం అందరి కళ్లు చెమర్చాయి. నరసయ్య కేవలం ఒక ఉపాధ్యాయుడిగానే కాకుండా, విద్యార్థులకు మార్గదర్శిగా, తోటి ఉపాధ్యాయులకు పెద్దన్నలా ఉండేవారు. చింతలపల్లి స్కూల్‌లో ఆయన పని చేసిన కాలంలో బడి అభివృద్ధి కోసం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఆయన పడిన తపన అమోఘం.

**భావోద్వేగాల వెల్లువ**

తన ఉద్యోగ ప్రస్థానంలో చివరి రోజైన నేడు, పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో నరసయ్య మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. "ఈ బడి నా గుడి. ఇక్కడి విద్యార్థులు నా కుటుంబ సభ్యులు. రేపటి నుండి బడి గంట వినపడదు, పిల్లల సందడి ఉండదు అంటే మనసు భారంగా ఉంది. కానీ, నా విద్యార్థులు సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే నాకు నిజమైన గుర్తింపు," అని ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

**ఘనంగా సన్మానం**

నరసయ్యపై ఉన్న గౌరవంతో చింతలపల్లి గ్రామస్థులు, పాత విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆయనను ఘనంగా సన్మానించి, పూలమాలలతో ముంచెత్తారు. తమ ప్రియతమ గురువుని విడిచి ఉండలేక విద్యార్థులు కన్నీళ్లు పెట్టుకోవడం అందరినీ కలిచివేసింది. తోటి ఉపాధ్యాయులు సైతం నరసయ్య అనుభవం తమకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు.






# వరకట్నం కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

- కోర్టు వాయిదాలకు గైర్హాజరు కావడంతో 'నాన్ బెయిలబుల్' వారెంట్
- వివరాలు వెల్లడించిన శాయంపేట ఎస్సై పరమేశ్వర్

అక్షర దర్బార్, శాయంపేట: వరకట్న వేధింపుల కేసులో కోర్టు వాయిదాలకు సరిగా హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండలం తహరాపూర్ గ్రామానికి చెందిన కొలగాని నవీన్పై 2024లో భార్య పెట్టిన వరకట్నం కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా నవీన్ కోర్టు వాయిదాలకు క్రమం తప్పకుండా హాజరుకాకపోవడంతో న్యాయస్థానం 'నాన్ బెయిలబుల్ వారెంట్' జారీ చేసింది. ఈ క్రమంలో బుధవారం నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు పరకాల కోర్టులో హాజరుపరిచారు. పరకాల జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సాయి శరత్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించడంతో, అతడిని పరకాల సబ్ జైలుకు తరలించారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్, గొడవ కేసుల్లో జరిమానా**

మరోవైపు మండలంలో నిర్వహించిన తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో చిక్కుకున్న ముగ్గురికి కోర్టు రూ. 1500 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. అలాగే బాట విషయంలో గొడవపడి పరస్పరం దాడులకు పాల్పడిన పత్తిపాక గ్రామానికి చెందిన కత్తి పతుషా, కత్తి ఓదెలు, కత్తి జామునలపై కేసు నమోదు చేయగా, వారు కోర్టులో జరిమానా చెల్లించినట్లు ఎస్సై వెల్లడించారు.





# రెడ్ క్రాస్ సొసైటీ చలివేంద్రం

- ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ రవి

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మండుటెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎన్ రవి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ, మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ చలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం. నా పరిమితుల్లో నేనున్న సహాయం రెడ్ క్రాస్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నాను అని అన్నారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఎండలో కష్టపడే కూలీలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వచ్చే సందర్భంలో తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. తర్వాత అదనపు కలెక్టర్ ఎన్ రవిని రెడ్ క్రాస్ సభ్యులు శాలువాతో సత్కరించి షీల్డ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా పి విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ల రమణారెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డెడ్ లైన్ మే15

- భద్రకాళి పూడికమట్టి తరలింపుపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లతో సమన్వయ సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ: చారిత్రాత్మక భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేసి, మట్టి తరలింపు ప్రక్రియను ఎటువంటి ఆటంకాలు లేకుండా మే 15 నాటికి పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి మట్టి తరలింపుపై సమన్వయ సమావేశం నిర్వహించారు. చెరువు నుండి తొలగించిన మట్టిని రెడ్డిపురం, పలివేల్పుల, మామునూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ భూముల్లోనే డంపింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. మట్టి తరలింపు సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. మట్టి తరలింపు ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**ఇటుక బట్టీల యజమానులకు అవకాశం**

మట్టి కోసం దరఖాస్తు చేసుకున్న ఇటుక బట్టీల యజమానుల అభ్యర్థనలను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. గతంలో అనుసరించిన నిబంధనల ప్రకారం.. నిర్ణీత రుసుమును (డిడి) చెల్లించిన వారికి మట్టి తీసుకెళ్లేందుకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు.

**వర్షా కాలం లోపే రెగ్యులేటరీ పనులు పూర్తి**

పూడికతీతతో పాటు భద్రకాళి చెరువు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెగ్యులేటరీ పనులను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఎన్ రవి, వైవీ గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, సాగునీటి పారుదల శాఖ సీఈ సుధీర్, ఎస్ఈ రాంప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఇరిగేషన్ ఈఈ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లిఫ్ట్ ఇచ్చి మహిళపై అఘాయిత్యం

- అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్
- దొంగిలించిన బైక్‌పై వచ్చి ఘాతుకం..
- చురుగ్గా వ్యవహరించి పట్టుకున్న పోలీసులు





అక్షరదర్బార్, టేకుమట్ల: లిఫ్ట్ ఇచ్చే నెపంతో మహిళను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, ఆమెపై దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడిన కిరాతకుడిని భూపాలపల్లి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి దొంగిలించిన మోటార్ సైకిల్, బాధితురాలి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఘటన వివరాలను చిట్యాల సీఐ మల్లేష్ గురువారం మీడియాకు వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కుషీనగర్ జిల్లాకు చెందిన అమర్జిత్ సింగ్ (33) వరికోత యంత్ర డ్రైవర్‌గా పనిచేస్తూ వివిధ ప్రాంతాల్లో సంచరిస్తుంటాడు. ఈ నెల 18న కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో మద్యం సేవించిన నిందితుడు, అక్కడ నిలిపి ఉంచిన ఒక బైక్‌ను దొంగిలించి భూపాలపల్లి జిల్లా వైపు బయలుదేరాడు. అదే రోజు రాత్రి 7:30 గంటల సమయంలో భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రాఘవరెడ్డిపేట సెంటర్ వద్ద ఓ మహిళ లిఫ్ట్ కోసం ఎదురు చూస్తుండగా, ఆమెను తన బండిపై ఎక్కించుకున్నాడు. మార్గమధ్యలో ఆరేపల్లి సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో బైక్ ఆపి, ఆమెను పొదల్లోకి ఈడ్చుకెళ్లి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించగా, బాధితురాలు గట్టిగా ప్రతిఘటించడంతో ఆమె బ్యాగ్‌ను లాక్కుని పరారయ్యాడు.

**నిందితుడి పట్టివేత**

బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, డీఎస్పీ సంపత్ రావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం చిట్యాల పరిధిలోని కైలాపూర్ సబ్ స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, పారిపోవడానికి ప్రయత్నించిన అమర్జిత్ సింగ్‌ను పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన టేకుమట్ల ఎస్ఐ అమూల్య, సిబ్బంది మహేందర్, రామకృష్ణలను జిల్లా ఎస్పీ అభినందించారు. "మహిళా భద్రత మా ప్రథమ ప్రాధాన్యం. అపరిచిత వ్యక్తులను నమ్మి వాహనాలు ఎక్కవద్దు. ప్రయాణాల్లో సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలి. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై ఉక్కుపాదం మోపుతాం." అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు.



# ఇద్దరు ఎస్సైల సస్పెన్షన్

## అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై సీపీ కఠిన నిర్ణయం

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్-ఇన్‌స్పెక్టర్లపై వేటు పడింది. నర్సంపేట ఎస్సై రవికుమార్, సీఏఆర్ (సీఏఆర్) విభాగంలో అటాచ్డ్‌గా ఉన్న ప్రవీణ్ కుమార్‌లను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు ఎస్సైలపై గత కొంతకాలంగా వివిధ అంశాల్లో ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఫిర్యాదులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. విచారణలో వారిపై వచ్చిన ఆరోపణలు నిజమని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సీపీ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.

**శాఖాపరమైన చర్యలకు ఆదేశం**

పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినా, విధి నిర్వహణలో అలసత్వం వహించినా సహించేది లేదని కమిషనర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. బాధ్యులైన ఇరువురు ఎస్సైలపై తదుపరి శాఖాపరమైన విచారణ కూడా కొనసాగుతుందని సమాచారం. ఒక్కసారిగా ఇద్దరు ఎస్సైలపై సస్పెన్షన్ వేటు పడటంతో కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వర్గాల్లో కలకలం రేగింది.






# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు

○ జిల్లా కలెక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్: అర్హులైన జర్నలిస్ట్ కి అక్రిడిటేషన్ లు అందజేస్తామని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్యశారద అన్నారు. వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం గురువారం కలెక్టర్ ఛాంబర్ లో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కోసం ఆన్లైన్ ద్వారా ఐపీఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను జీవో ననుసరించి క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రయత్నించాలని ఆమె సూచించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 2026-2028 సంవత్సరానికి నూతన కార్డులు జారీచేసే పక్రియను వేగవంతం చేయాలని వారు పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియని ఆమె తెలిపారు. ఎవరు కూడా ఆందోళనకు గురి కాకుండా జర్నలిస్టులు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ ప్రేమలత, వరంగల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శ్రీరాం రాంచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, బొడిగ శ్రీనివాస్, మట్టా దుర్గాప్రసాద్, కోదాటి గోపాల కృష్ణ, పల్లెల సోమేశ్వర్, హుస్సేన్ పాషా, బొల్లపల్లి రాజు పాల్గొన్నారు.

# కీలక మార్పు

○ ఇకపై నామినేటెడ్ పద్ధతిన పీఏసీఎస్ చైర్మన్ల నియామకం

○ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) చైర్మన్ల నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ సంచలన ప్రకటన చేశారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఏసీఎస్ కమిటీల అంశంపై ఆయన స్పష్టతనిచ్చారు. రాబోయే రోజుల్లో పీఏసీఎస్ చైర్మన్లను ఎన్నికల ద్వారా కాకుండా, నామినేటెడ్ పద్ధతిలో నియమించనున్నట్లు వెల్లడించారు. సహకార రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, రైతులకు సేవలను మరింత వేగంగా చేరవేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పాలకవర్గాల గడువు ముగిసిన సంఘాలకు త్వరలోనే కొత్త సారథులను ప్రభుత్వం ఖరారు చేయనుంది.

**త్వరలో విధివిధానాలు**

నామినేటెడ్ ప్రక్రియకు సంబంధించి పూర్తిస్థాయి విధివిధానాలను ప్రభుత్వం త్వరలోనే జీవో రూపంలో విడుదల చేయనుంది. మంత్రి పొంగులేటి చేసిన ఈ ప్రకటనతో రాష్ట్రంలోని సహకార రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

# ప్రారంభం కాకముందే పగుళ్లు

○ పరకాల డిగ్రీ కళాశాల నిర్మాణంలో 'నాణ్యత' మాయం!

○ రూ.5 కోట్ల నిధులు.. అప్పుడే భవనానికి బీటలు

○ రంగులతో పగుళ్లను కప్పిపుచ్చే ప్రయత్నం.. విద్యార్థుల భద్రతపై ఆందోళన



అక్షరదర్బార్, పరకాల : ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత పరకాల ప్రాంత విద్యార్థుల కోసం నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం ప్రారంభోత్సవానికి ముందే వివాదాల్లో నిలిచింది. నిర్మాణం పూర్తికాకముందే భవనం గోడలకు నిలువునా పగుళ్లు కనిపిస్తుండటం నిర్మాణ నాణ్యతపై తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యా మందిరం, పునాదుల స్థాయిలోనే బలహీనంగా మారుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– రూ. 5 కోట్లతో నిర్మాణం.. పర్యవేక్షణ శూన్యం?

రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్ష అభియాన్ (రుసా) పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సుమారు రూ. 5 కోట్ల నిధులతో ఈ కళాశాల భవనాన్ని నిర్మిస్తున్నారు. పరకాలతో పాటు మొగుళ్లపల్లి, చిట్యాల, శాయంపేట వంటి పరిసర మండలాల విద్యార్థులకు ఇది ఒక వరమని భావించినా, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణా లోపం వల్ల భవనం పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది.

**పగుళ్లపై రంగుల పూత.. కప్పిపుచ్చే యత్నం!**

భవన నిర్మాణ పనులు ప్రారంభమైన ఏడాదిలోపే ప్రధాన గోడలపై పగుళ్లు ఏర్పడటం గమనార్హం. అయితే, ఈ లోపాలను సరిదిద్దాల్సింది పోయి, సిమెంటుతో నునుపు చేసి రంగులు వేయడం ద్వారా అధికారులు, కాంట్రాక్టర్లు సమస్యను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "పైకి మెరిసే రంగులున్నా.. లోపల పగుళ్లు భయం గొల్పుతున్నాయి" అని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమేనా?**

పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వేలాది మంది ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఘన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. అంతటి ప్రాముఖ్యత ఉన్న చోట డిగ్రీ కళాశాల నిర్మాణంలో ఇటువంటి అక్రమాలు జరగడం దురదృష్టకరం. నాణ్యత లేని భవనంలోకి విద్యార్థులను పంపడం వారి ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

ప్రజా ధనం వృధా కావడమే కాకుండా, విద్యా వ్యవస్థకు కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక విద్యావేత్తలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిపుణుల కమిటీతో తనిఖీ చేయించి, భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని పరకాల ప్రజలు కోరుతున్నారు.

# పాఠశాల అభివృద్ధికి ఝాన్సీరాణి విశేష కృషి

○ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు




అక్షరదర్బార్, భూపాలపల్లి: సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్ర ఝాన్సీరాణి వెంకటేశ్వర్లు పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీలో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్ర ఝాన్సీరాణి ఉద్యోగ విరమణ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ఝాన్సీరాణి వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఝాన్సీరాణి విద్యను అందించడంలో ఆమె కృషి, పట్టుదల, ధైర్యంను కొనియాడారు. పాఠశాల సమస్యల సాధనలో ఎంతో పట్టుదలను కనబరిచి విద్యార్థుల ప్రగతికి పాటుపడ్డారన్నారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ పాఠశాల అంటే సమాజ ప్రతిబింబాన్ని చూపుతుందని, పాఠశాల బాగుంటేనే సమాజం బాగుంటుందనే నమ్మకంతో పాఠశాల అభివృద్ధికి తన 42 సంవత్సరాల ఉద్యోగ బాధ్యతను విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి, పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించటానికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.